# విద్యార్థి

శ్రీ వేదుల లక్ష్మణమూర్తి

ఆ రోజు ఉదయం రమారమి ఎనిమిది గంటలౌతుంది. జడివాన పడుతోంది. ఆకాశ మంతా బూడిద రంగుగా ఉంది. ఆకాశంలో సూర్యుడున్న చిహ్నాలు కనుపించడం లేదు. ప్రకృతికాంత పురుషునిమీద కోప గించి నల్లని వలువను కప్పుకొని కన్నీరు కారుస్తున్న ట్లుంది. పురుషుడు ఆమెను బ్రతిమాలుతున్నాడు. ఎంతకూ వినకపోతే విసుగెత్తి తన గంభీర గర్జనతో ఆమెను బెదిరిస్తున్నాడు. ఆమె హఠం చేస్తూ ఇటునటు కదులుతోంది. కదిలేటప్పుడు కన్నులు మిరుమిట్లుగొలిపే ఆమె శరీరలావణ్యం, కప్పుకొన్న వలువసందులనుండి మెరుస్తోంది. మానవుని మనోఫలకంమీద ఆవరించిన అజ్ఞానంలాగ ఆకాశంమీద మేఘం ఆవరించింది. అజ్ఞానఫలితంగా సంభవించే ప్రమాదాలవలె గాలి తెరలు, జడివాన ప్రాణికోటికి చికాకును కలుగ జేస్తున్నాయి.

నేను మా వీధి అరుగుమీద చాప పరచుకొని గోడకు జేరబడి కూర్చున్నాను. మా యింటి తాటాకు చూరు క్రిందికి దిగిఉంది. అరుగు మట్టిది; విశాలంగా ఉంది. మా యింటిముందు కంకర లేచిపోగా తయారైన చౌచారోడ్డు. దాని తరువాత కొన్ని వరిచేలు. అవి దాటాక మామిడిచెట్ల బారుతో కాలువగట్టు. దాని కావల మళ్లీ వరిచేలు. ఇంకా దూరానికిమాస్తే ఆకాశం భూమీ కలిసే క్షితిజం. జడివానవచ్చేశబ్దం మనస్సుకి మైకాన్ని కలుగజేస్తోంది. చదువుదామని ఎదుట బెట్టుకొన్న దినపత్రిక అలాగే పడిఉంది. ఎదుటికి చూస్తూ ధ్యానిస్తూ కూర్చున్నాను. వర్షంనుండి రక్షించుకొంటూ ఒక కుక్క మా యింటి రెండో అరుగు యెక్కింది. శరీరమంతా టకటకమని చప్పుడు చేస్తూ వంటిమీది నీటిని దులుపుకొంది మూలకుపోయి పడుక్కుంది నాకు యెదురుగా మామిడిచెట్టు మొదలు దగ్గరకు రెండు గాడిదలు చేరి, తలలు వంచు కొని దగ్గర దగ్గరగా నిలబడ్డాయి. ఇంతలో నా దగ్గర చదువుకొనే సుబ్బారావు పుస్తకాలసంచి చొక్కా క్రింద పెట్టుకొని వంగి వంగి చురుగ్గా నడిచివచ్చి మెట్లెక్కాడు. వాడి బట్టలు, తల తడిశాయి. చొక్కాక్రింది సంచితీసి అరుగుమీద పెట్టాడు. "ఏమిరా! వర్షంలో తడుస్తూ వచ్చావు! ఏ మంత మించిపోయింది? ఇవేళ బడికి శలవుకూడాను?" అని అంటూ తొందరగా లేచాను. లోపలికివెళ్ళి రెండు తుండుగుడ్డలు తెచ్చి "లాగూ చొక్కా విప్పెయ్, తడిసి ముద్దయిపోయాయి" అంటూ వాటిని యివ్వబో యాను. "వద్దండి, వద్దండి, కాస్సేపటికి ఆరిపోతా యండి" అంటూ చొక్కా ముందుభాగం పిండుతు న్నాడు. "ఏడిసినట్టేఉంది! గుడ్డలు తడిసి ముద్దయితే ఆరిపోతాయంటా వేమిటి? తడిగుడ్డల్తోఉంటే జలుబు చేస్తుంది. ఊఁ తీసుకో! త్వరగా విప్పెయ్, ఆ గుడ్డలు" అని కొంచెం గద్దించాను. విధిలేక తువ్వాళ్లు తీసు కొన్నాడు. ఒకటి చుట్టబెట్టుకొని రెండో దానితో తలా వళ్ళూ తుడుచుకొన్నాడు. ఇంతలో నాభార్య, రాధ "అయ్యొయ్యా, అదేమిరా తడుస్తూ వచ్చావ్! పద, లోపలికి. నీళ్లపొయ్యిదగ్గర కూర్చో!" అంటూ గుమ్మం లోకి వచ్చి నిలబడింది. వాడు లాగూ చొక్కా పిండుతూ అరుగు చివర నిలబడ్డాడు. "త్వరగా కానియ్యి, రా లోపలికి!" అని మళ్లీ హెచ్చరించింది. వాడు నెమ్మదిగా సంచిలోని పుస్తకాలు బయటికి తీసి అరుగుమీద పెట్టి సంచి లోపలికి తీసుకొనివెళ్లాడు. సంచిలో ఇంకా యేవో ఉన్నాయి. వాడి వెనుక నేనూ లోపలికి వెళ్ళాను. వాడు లోపలి వసారాలో సంచిలోని వంకాయలు దిమ్మరి చాడు. "ఏమిరా, వద్దంటే అర్థంకాదూ, యేదోఒకటి తెస్తూంటావ్? వాటిని సంచిలోకి యెత్తు! సాయం కాలం తీసుకొనిపోదువుగాని" అని కొంచెం కఠినంగా మాట్లాడాను. వాడు బిక్కముఖంతో 'మా అమ్మ తీసుకు వెళ్ళమందండి" అన్నాడు.

"మీ అమ్మ, నువ్వు అడక్కుండా తీసుకెళ్ళమందా?" వాడు మాట్లాడలేదు. "మాకోసం యేమీ తేవద్దని చెప్పడం ఇది యెనభయ్యోసారి. వద్దు, తీసుకుపొమ్మంటే యేడుస్తావు. నువ్వు యేవేవో తెచ్చి మాకిచ్చేస్తున్నావని, ఇల్లుగుల్లచేస్తున్నావని మీవాళ్లు గోలపెడతారు. ఎందుకు మాకీ లేనిపోని సంత. అణా డబ్బులు పెడితే వచ్చే కాయగూరకి మేం అప్రతిష్ఠపాలు కావలసివస్తోంది. వాటిని సంచిలోకి ఎత్తెయ్! ఊఁ! చూస్తావేం?" అని గద్దించాను. "ఇంక తీసుకురానండీ" అని అలాగే తలవంచుకొని నిలబడ్డాడు. రెండు కన్నీటి చుక్కలు వాని పాదాలముందుపడి మట్టిలోకి ఇంకిపోయాయి.

వద్దని ఎన్నిసార్లు చెప్పావురా? మీ వాళ్ళకి యిష్టంలేనప్పుడు యెందుకు నాయనా తేవడం? నువ్వా, తిట్లూ దెబ్బలూ తింటున్నావు, మేమూ, అప్రతిష్ఠపాలౌతున్నాం. వేళకి వచ్చి చదువుకొని పోక ఇవన్నీ యెందుకురా? నువ్వు పెద్దవాడవయి సంపాదించేటప్పుడు నీ యిష్టమొచ్చినవన్నీ తెచ్చియ్యి, వద్దంటామేమో చూడు. సరే వాటికేం గాని బట్టలు దండెంమీద ఆరవెయ్యి. పొయ్యి దగ్గరకూర్చో." అంది రాధ. వాడు వెంటనే కాయలు అక్కడే వదిలి దండెంమీద బట్టలు ఆరేశాడు. పొయ్యిదగ్గర కూర్చున్నాడు. "వర్షంలో ఎందుకు వచ్చావ్? చద్దన్నం తిన్నావా?" అని ప్రశ్నించింది రాధ. "సంగందూరం వచ్చాక వచ్చిందండి వర్షం" అన్నాడు. "కాస్సేపు వర్షం తగ్గేదాకా యే పాకలోనైనా ఆగలేకపోయావా? ...మరి అన్నం తిన్నావా?" అని మళ్ళీ ప్రశ్నించింది. "తిన్నానండి" అని జవాబు చెప్పాడు. వాడి జవాబు పూర్తిగా వినిపించుకోకుండా, లోపలికి వెళ్ళి గ్లాసుతో కాఫీ తెచ్చి వాడి ముందుపెట్టి "ఈ కాఫీ త్రాగు! చలితగ్గుతుంది." అన్నది రాధ. "వద్దండి, వద్దండి కాఫీ ఎవ్వడూ త్రాగనండి" అని బిడియపడుతూ అన్నాడు. "త్రాగవని తెలుసులే, ఈవేల్టికి త్రాగెయ్!" అంది. "వద్దండి త్రాగనండి" అంటూ ముడిచిపెట్టుకొని కూర్చున్నాడు. నేను కొంచెం దగ్గరగా వెళ్ళి "మేమిచ్చిన దాన్ని వద్దనకూడదు, త్రాగెయ్!...ఊఁ! తీసుకో" అని ఒత్తిడిచేశాను. తప్పనిసరిగా గ్లాసు తీసుకొని బలవంతంగా త్రాగాడు. వెంటనే లేచి నూతి దగ్గర గ్లాసు కడిగి తెచ్చి వసారాలో పెట్టాడు. నేను మళ్ళీ వీధి అరుగుమీదికి వచ్చాను. నావెనకనే పిల్లిలా వాడూవచ్చాడు. "తెలుగుపద్యం, ఇంగ్లీషుపద్యం వచ్చాయండి. చూడకుండా వ్రాయనాండి" అన్నాడు. "కాస్సేపు వళ్లు ఆరి చలి తగ్గేవరకూ పొయ్యి దగ్గరకూర్చోరా, ఇంతలోకే చదువు చెడిపోదులే" అన్నాను. కాని వాడు కదల్లేదు. తల వంచుకొని పుస్తకాలు తిరిగేస్తున్నాడు. వాడి ముఖంలో చదువు చెడిపోతోందనే బాధ వ్యక్తమౌతోంది. "సరే, పొయ్యి దగ్గర కూర్చుని వ్రాయి, వెళ్ళు" అన్నాను. పుస్తకాలు తీసుకొని లోపలికి పోయాడు.

సుబ్బారావు తండ్రి పాతిక ముప్ఫైయకరాల భూస్వామి. వాళ్ళయిల్లు మా అత్తగారింటికి యెదురుగా ఉంది. వాళ్లదో చిన్నగ్రామం. అది నే నిప్పుడున్న ఊరికి మైలున్నరదూరముంది. శిథిలమైపోయిన కంకరబాట అనేక వంకరలు తిరుగుతూ ఈ రెండు గ్రామాల్నీ కలుపుతోంది. సుబ్బారావుకి ముగ్గురన్నలు ముగ్గురు తమ్ముళ్లు ఉన్నారు. వాళ్ళది స్వంత వ్యవసాయం. పాడి, పంట, సంతానంలో ఆ యిల్లు నిండుగా ఉంటుంది. సుబ్బారావు తండ్రీ, ముగ్గురన్నలూ వ్యవసాయపు పనుల్లో ఉంటారు. చేవలు తేరిన శరీరాలతో, బండబారిన బుద్ధులతో ఉన్న వాళ్ళని చూస్తే పశువులకీ వాళ్ళకీ ఎంతో తేడా లేదనిపిస్తుంది. వీని అన్నలలో ఒకనికో యిద్దరికో పెళ్ళిళ్ళయాయనుకొంటాను.

రెండేళ్ళ క్రితం, సంక్రాంతి పండుగకు పదిపన్నెండు రోజులు నేను మా అత్తవారింట్లో మకాం చేశాను. నేనక్కడికి వెళ్ళిన మరునాడు ఉదయం వీధి అరుగుమీద పడకకుర్చీలో పత్రిక చూస్తూ కూర్చున్నాను. పదిపదకొండేళ్ళ కుర్రాడు నెమ్మదిగా అరుగుదగ్గరకు చేరాడు. వీడు ఆ యెదుటి యింటివారి పిల్లవాడని ఊహించాను. 'ఏం వచ్చావ్?' అన్నాను. 'యేంలేదండి' అన్నాడు. అరుగుమీదకు మోచేతులమీద వాలి వీధి వైపుకి చూస్తూ క్రింద నిలబడ్డాడు. నా దృష్టి పత్రికమీద లేదు. నల్లగా కళ కళలాడే వాని ముఖం చూస్తున్నాను. వాడు మధ్య మధ్య నావైపు చూచి మళ్ళీ ముఖం తిప్పుకొంటున్నాడు. వాడు యేమీ లేదని నాతో చెప్పినా వాని ముఖం తీరు చూస్తే నాతో యేదో మాట్లాడాలనే ఉద్దేశం ఉన్నట్టు

స్పష్టపడుతోంది. పది పదకొండేళ్ళ కుర్రాడు పనేమీ లేకుండా అంత బుద్ధిగా నా యెదుట నిలబడ్డం నాకు కొంచెం వింతగా ఉంది. నేను అయిదారు వందల మంది పిల్లలు చదువుకొనే హైస్కూల్లో పని చేస్తున్నప్పటికీ తరగతిలో తప్ప మరెక్కడా యే పిల్లవాడూ నన్ను పలుకరించి మాట్లాడడు, నా యెదుట నిలబడడు. సాధ్యమైనంతవరకూ పిల్లలు నన్ను చూసి తొలగిపోతారు. ఎదుట బడితే ఒక్కొక్కడు ఒక నమస్కారం చేసి పోతాడు. 'వీడు మా స్కూల్లో చదివే కుర్రాడు కాడుగా' అనుకొన్నాను మనస్సులో. వీళ్ళ కుటుంబంలో ఉన్న వాళ్ళందరిలోకీ వీడు తప్పబుట్టినట్లున్నాడు. నల్లగా, బలహీనంగా ఉన్నాడు. కాని విశాలమైన వాని కళ్లు, నుదురు వాని సూక్ష్మబుద్ధిని వ్యక్తం చేస్తున్నాయి చదువుకొంటే బాగా అభివృద్ధికి వచ్చేవాడిలా కనుపిస్తున్నాడు. వాణ్ణి గురించి ఆలోచిస్తున్నానే గాని మాట్లాడలేదు. కొంత సేపటికి వాడు 'మీరు హైస్కూల్లో మాస్టారాండి?" అని ప్రశ్నించాడు. "ఆఁ" అన్నాను యింకా యేమైనా అడిగితే చెప్పడానికి కుతూహల పడుతూ. 'వచ్చే యేడు మీ స్కూల్లో చేరతానండి' అన్నాడు మెల్లగా. 'ఓ తప్పకుండా చేరు; ఇప్పుడేం చదువుతున్నావ్' అంటూ చేతిలోని పత్రిక క్రింద పెట్టాను. 'ఐదో క్లాసండి. మా క్లాసులో నేనే ఫస్టండి. నన్ను చేర్చుకొంటారాండి మీ స్కూల్లో?' అని ఆత్రుతతో నా వైపు చూశాడు. "క్లాసులో ఫస్టుగా ఉంటున్నావుగా? బాగా చదివేవాళ్లను తప్పకుండా చేర్చుకొంటారు." అని వానికి సంతోషం కలిగించాను. అది మొదలు వాడు నన్ను వదలిపెట్టలేదు. మధ్యాహ్నం తన పుస్తకాలన్నీ నాకు చూపించాడు. వాటిలోని పద్యాలూ, పాఠాలూ తనకు బాగా వచ్చునన్నాడు. తన లెక్కల పుస్తకంలోని ప్రతీ లెక్కా తను చేస్తానన్నాడు. ఫస్టుఫారం ఇంగ్లీషు పుస్తకంలో సగం పాఠాలు తనకు వచ్చునన్నాడు. 'ఏమైనా అడగండి చెప్తాను' అన్నాడు. చదువులో వానికుండే ఉత్సాహం ఆసక్తీ నన్ను చకితుణ్ణి చేశాయి. అన్ని విషయాల్లోనూ ఒకటి రెండేసి ప్రశ్నలు వేశాను. అన్నింటికీ చక్కగా జవాబులు చెప్పాడు. 'యే క్లాసులో చేరతావు?' అని అడిగాను. "ఈయేడు అయిదో క్లాసు అయిపోతుంది కాదండీ, ఆరో క్లాసులో చేరతానండి" అన్నాడు. "వచ్చే వేసంగి శలవుల్లో యెవరిదగ్గరైనా చదువుకొని ఈ యింగ్లీషు పుస్తకం పూర్తి చెయ్యి, ఫస్టుఫారం లెక్కలు కూడా నేర్చుకో, సెకండు ఫారంలో చేరొచ్చు" అన్నాను. వాని సంతోషానికి మేరలేదు. 'తప్పకుండా మీదగ్గరికి వచ్చి చదువుకొంటానండి." అని చెప్పి యింటికి వెళ్ళాడు. మళ్లో అరగంటకి తిరిగివచ్చాడు. ఇందాకటి ఉత్సాహం ఇప్పుడు వానిలో లేదు. ముఖం యేడుపును సూచిస్తోంది. సాయంకాలం వేళ చేలగట్లంట తిరిగివద్దామని బయులుదేరాను. వాడు నన్ను వెంబడించాడు. "ఏం, నాతో వస్తావా?" అన్నాను. "వస్తానండి" అని దీనంగా అన్నాడు. పదిళ్లుదాటి ఊరిబయటికి వచ్చాం. "అలా ఉన్నావేం?" అని అడిగాను. "మాబాబు చదువెందుకు ఈ చదివింది-చాల్లే అన్నాడండి" అని కళ్లు చొక్కా ముందుభాగంతో తుడుచుకొన్నాడు. "ఈ మాత్రం దానికి యేడవడ మెందుకు? మీబాబుతో నేను చెప్తానులే" అని ఊరడించబోయాను. "మాబాబు వినడండి. నిరుడే చదువు మానెయ్యమన్నాడండి, పొలంపని చెయ్యమని తిడుతూంటాడండి. తిడుతూన్నా నేను బడికి వెళ్ళడం మానలేదండి" అని తన నిరాశను వెల్లడించాడు.

"పరవాలేదు, నేను మాట్లాడి నువ్వు చదువుకొనే ఏర్పాటు చేస్తానుగా" అని ధీమాగా చెప్పాను. నేను పిల్లకాలువ గట్టుయెక్కి ఒకవైపుకి నాలుగడుగులు వేశాను. "ఇటువైపుకి వెడదామండి" అని కొంచెం తొట్రుపడుతూ నా వెనుక నిలబడి అన్నాడు. నేను వెనక్కి తిరిగి "ఏం?" అన్నాను. "అబ్బే, యేమీలేదండి, ఇటు బావుంటుందండి" అన్నాడు. సందేహిస్తూ. "ఏం ఇటు బాగుండదా?" అని ప్రశ్నించాను. "అటు బాగానే ఉంటుందండి" అని నసిగాడు "ఇకెందుకు వెళ్ళొద్దంటున్నావ్?" అని వాడి ముఖంలోకి చూచాను. వాడు మాట్లాడక తలవంచుకొన్నాడు. "సందేహిస్తున్నావేం? చెప్పు" "అటు మా పొలం ఉందండి." "మరీ మంచిది, మీపొలం చూడొచ్చుగా?" "అక్కడ మా అన్నయ్యలున్నారండీ, తిడతారండి" "ఎందుకు తిడతారు? ఏం చేశావేమిటి?" "వాళ్ళు రోజూ పొలం రమ్మంటారండి, నేను చదువుకోడం వాళ్ళకి యిష్టంలేదండి" "ఇవాళ నేను దగ్గర ఉన్నానుగా? తిట్టరు, రా, ఇటే పోదాం" అని నేను నడక సాగించాను. విధిలేక నావెంబడి వస్తున్నాడు. నాలుగైదు ఫర్లాంగులు నడిచాక పెద్దపశువులశాల కనిపించింది.

"అదేనండి మా దూళ్లసాల" అన్నాడు. మరి నాలుగడుగులు వేసి వెనక్కి చూచాను. వాడు బెదురుచూపులు చూస్తూ అక్కడే ఆగిపోయాడు. "ఆగిపోయావేం? రా! నేనుండగా నిన్నెవ్వరూ యేమీఅనరు, ఊఁ, రా!" అని హెచ్చరించాను. వాడు నెమ్మదిగా అడుగు లేస్తూ బయలుదేరాడు. పాక సమీపానికి వచ్చేసరికి వాళ్ళ అన్నలలో రెండోవాడు ఇనపమనిషిలా నేల అదిరేటట్లు అడుగులు వేసుకొంటూ మావైపు వస్తున్నాడు. తమ్ముణ్ని చూచి "యేరా, మద్దేల్నించీ యెక్కడ సచ్చావ్? ఇప్పుడెందుకూ సేకులూపుకుంటా వచ్చావ్? మేం పొలంలోపడి సచ్చేట్టు సాకిరీ సేత్తోంటే వణ్ణం తేలేవూ?" అంటూ నన్నుదాటి నా వెనుక నాలుగుగజాల దూరంలోవున్న తమ్ముడిదగ్గరకు వెళ్లాడు. నేను వెనక్కితిరిగి యేదో చెప్పబోయేలోగానే "మాట్టాడవేం యెదవా?" అని వాని దవడ మీద చెళ్లునకొట్టాడు. నేను తొందరగా దగ్గరకువెళ్ళి మరి కొట్టకుండా అడ్డగించాను. నన్నుచూచి ఇంకేమీ చెయ్యలేక "సూడండి బాబూ! ఇంటికాణ్ణుంచి వణ్ణమేనా తేలేకపోతే మరెందుకండి యీ బక్కెదవ?" అంటూ విసురుగా వెళ్ళిపోయాడు. నాకు ముచ్చెమటలు పోశాయి. తల తిరిగింది. నా చదువూ, తెలివీ తుమ్మమోడులాంటి ఆ మనిషిముందు యెందుకూ పనికి రాలేదు. ఆ కుఱ్ఱవాడి తలను రెండుచేతులతోనూ పట్టుకొని నా కడుపుకి అదుముకొన్నాను. వాని కళ్ళనుండి నీరు యేకధారగా కారుతోంది. నల్లని దవడ పొంగింది. ఏడుపును బలవంతాన అణచుకొంటున్నకారణంచేత ఎక్కిళ్ళు వస్తున్నాయి. కోమలమైన వాని లేతహృదయాన్ని నా చేతులతో నలిపి రక్తం పిండుతున్నట్లనిపించింది నాకు. ఇటు, వద్దంటే బలవంతాన తీసుకొచ్చాను యీ వసికందును—ఈ మాట గుహలోని పులి గర్జనలా నా హృదయంలో ప్రతిధ్వనిస్తోంది. వాని చొక్కా యెదుటి భాగమంతా కన్నీరు తుడుచుకొంటున్నకారణంచేత తడిసి పోయింది. వాని చెయ్యి పట్టకొని వచ్చిన త్రోవనే నడవసాగాను. వానికి యేదో చెప్పి ఊరట కలిగించాలని నా ఊహ. కాని వానితో యే ముఖం పెట్టుకొని మాట్లాడగలను. కొంతదూరం వెళ్ళాక "నేను చదువుకొంటున్నానని కోపమండి మా అన్నయ్యలకి. రోజూ యేదో వంకబెట్టి తిడుతూ కొడుతూంటారండి" అని వాడు నన్ను మాట్లాడ్డానికి ప్రేరేపించాడు. "ఔనురా బాబూ, వాళ్ళు అడివి జంతువులు" అని, మరి మాట్లాడలేక పోయాను.

ఆ రాత్రి భోజనాలయాక నేను అరుగుమీద కూర్చున్నాను. మా మామగారు, ఇంకా నలుగురైదుగురు పెద్దమనుషులు ఒక్కొక్కరుగా అరుగు మీదకు చేరారు. వారిలో మా మామగారే కొంచెం సంస్కృతం, తెలుగూ చదువుకొన్నారు. మిగిలినవారిలో ఇద్దరు ముగ్గురికి చదవడం వ్రాయడం మాత్రమే వచ్చును. మిగిలినవారికి అదీ రాదు. వారు రోజూ రాత్రి భోజనాలయాక యీ విధంగా చేరి యేదో లోకాభిరామాయణంతో కాలక్షేపం చెయ్యడం వారి అలవాటు. అప్పుడప్పుడు పది పదిహేను రోజులపాటు మా మామగారు పురాణం చదువుతూంటారు. ఆ చుట్టుప్రక్కల ఆడా మగా వచ్చి పురాణం వింటూంటారు. అదిలేని రోజుల్లో లోకాభి రామాయణం సాగుతోంటుంది. అక్కడకు చేరిన వారిలో యెదురింటి యజమాని జగ్గయ్య కూడా ఉన్నాడు. కొంతసేపు నేను వారి ప్రసంగాలు వింటూ కూర్చున్నాను. ఆ తరువాత "జగ్గయ్యా, మీ కుఱ్ఱవాడు చాలా బుద్ధిమంతుడూ తెలివైన వాడూ సుమా" అని వాని అభిప్రాయం రాబట్టడానికి అన్నాను. 'ఎవడండి?' అన్నాడు. "వాడే ఐదో క్లాసు చదివే కుఱ్ఱాడు" "సుబ్బారావాండి" "ఆఁ, ఆఁ" "ఎందుకొచ్చిన తెలివండీ కూటికా గుడ్డకా?" అని నిర్లిప్తంగా అన్నాడు. "అదేమిటయ్యా అలా అంటావు? శ్రద్ధగా చదివితే చాలా అభివృద్ధిలోకి వస్తాడు." "వళ్ళొంచి పనిచేసి కడుపునిండా తిని సుకపడక యెందుకొచ్చిన సదువులండీ యివి. ఒళ్లూ యిల్లూ గుల్ల సేసుకొని చూక్కలు ఫైన్లూ, బియ్యేలు సదవడం, ఆ తరువాత నౌకరీకోసం అడ్డమైన వోళ్ళ కాళ్ళూ పట్టుగోడం. ఇంతా యేడిత్తే అరవయ్యో డెబ్బయ్యో కడిగి సేతుల్లో పెడ్తారు. పట్నాల్లో ఆ జీతం సాలక మిగిలున్న యిల్లూ వాకిళ్ళూ అమ్ముకోడం; అయికూడా అయిపోయాక లంచాలతో మా బోటిగోళ్ళని గద్దలూ రాబందుల్లా పీక్కు తినడం. వద్దు బాబూ! మాకు సదువులెందుకు, యిలా బతికితే సాలు" అని ఉచ్చైస్స్వరంతో విరామం లేకుండా మాట్లాడాడు. "మహా భేషుగ్గా చెప్పావోయ్," అన్నాడో ముసలాయన ప్రక్కను కూర్చుని. "నిజమే,

ఇప్పటి చదువు లలాగే ఉన్నాయి" అన్నాడింకో ఆయన. మొత్తంమీద అక్కడున్న నలుగురూ జగ్గయ్య మాటల్ని సమర్థించారు. ఈ మాటలు వాని యాభై సంవత్సరాల అనుభవసారం. అశిక్షితమైన అతని మనస్సులో శిక్షితులనబడేవారి నిత్య జీవిత వ్యవహారాలను మథించగా వచ్చిన హాలాహలం. జీవిత సంగ్రామంలో వాని హృదయానికి తగిలిన గాయాల బాధవల్ల వెలువడిన ఆక్రందనం. అక్కడున్నవారు వారి వారి ప్రసంగాలను విస్మరించి నే నేమి చెబుతానో అని నా వైపు చూస్తున్నారు. వీధి తనాబీకి వ్రేలాడుతున్న హరికెన్‌లాంతరు వెల్తురులో నేను ఒకసారి జగ్గయ్యముఖం చూడబోయాను కాని అతను వీధివైపుకి చూస్తున్న కారణంచే వాని ముఖలక్షణాలేవీ నాకు కనుపించలేదు. "నువ్వు చెప్పిన మాటలు కాదనడానికి వీల్లేదు. కాని నువ్వు చెప్పినది, చదువుకొని నౌకరీలు చేస్తున్నవార్ని గురించి. వారు జీవనోపాధికోసం నౌకరీలలో ప్రవేశిస్తారు. ఆ జీతపురాళ్ళతో కడుపునిండక అక్రమప్రవర్తనకు సిద్ధపడతారు. కొంత కాలానికి అది అలవాటై చివరికి పరమేశ్వరసృష్టి, అందులో మానవునికుండే విశిష్టతను మరచిపోయి మానవత్వాన్ని పోగొట్టుకొంటారు. నిజానికి వారు వస్తువులను ఉత్పత్తిచేసే యంత్రాల్లాంటివారు. వారిని చదువుకొన్నవాళ్ళనడం పొరపాటు. చదువును మరచిపోయినవాళ్లనడం మంచిది. కాని నౌకరీచేసేవాళ్లంతా ఇల్లాగే ఉండరు. తన ఉద్యోగధర్మాన్ని గుర్తించి, నీతి నియమాలకు కట్టుబడి, ప్రజల శ్రేయస్సుకోసం పాటుబడేవారు నూటికొక్కడైనా లేకపోలేదు." అని యింకా నేను చెప్పబోతుండగా "అలాంటోడికి కూడేదండీ?" అన్నాడు జగ్గయ్య. "నిజమే, అలాంటి వాళ్లకి కడుపు నిండే పరిస్థితులు యింకా యేర్పడలేదు మన దేశంలో. సరే, దానిమాట అటుంచు. అవి నీతిగా ప్రవర్తించే ఆఫీసర్లు, గుమస్తాలు, డాక్టర్లు, లాయర్లు మొదలైనవారిని మాత్రమే నువ్వు యెరుగుదువనుకొంటాను. వీరుగాక చదువుకొన్నవారెందరో ఉన్నారు యెరుగుదువా?" అన్నాను. "ఇంకేరున్నారండి" అన్నాడు అమాయకంగా: "నువ్వు అప్పుడప్పుడు పురాణం వింటూంటావు. ఆ రామాయణం భారతం, భాగవతం వ్రాసినవారు చదువుకొన్నవారే నంటావా?" "సదుంకోపోతే అంత గొప్పగా రాయగల్గురాండి?" "మీ ఇంట్లో పటాలేమైనా ఉన్నాయా?" "లేకేవండి" "అందులో నీ కళ్లకి అందంగా కనుపించి నీకు ఆనందాన్ని కలుగజేసే పటాలేమైనా ఉన్నాయా? "లేకేవండి, ఆ మద్దె నేను కాకినాడెళ్లినప్పుడు పటాల దుకాణంలో గోడమీద మురళీకృష్ణుడు, ఆంజనేయులోరి పటాల్ని సూచి రోడ్డుమీద పోతూన్నవాణ్ణి అట్టే ఆగిపోయాను. దుకాణంమీద కెళ్ళి వెంటనే కొన్నానండి" "అయితే ఆ పటాలు రాసినవోళ్ళు చదువుకొన్నవారేనా?" "అ రాసినోళ్లు బియ్యేలు సదుంకొన్నారంటారా?" "లేదు. బి. ఏ. చదువుకొన్నవాళ్ళు మాత్రమే చదువుకొన్నవాళ్ళనుకోకు. మంచి మంచి కథలూ, నాటకాలూ, నవలలూ, కావ్యాలూ, వ్రాసేవారు, కన్నుల విందుగా బొమ్మలు వేసేవారు, చెవుల కింపుగా పాడేవారు ఆయా విషయాల్లో చదువుకొన్న వాళ్ళే. హైస్కూల్లో చదువు సామాన్య జ్ఞానం కలుగజేస్తుంది. తరువాత ఎవనికి యే విద్యలో అభిరుచి ఉంటుందో ఆ విద్య నేర్చుకోవాలి. అందులో ప్రవీణత సంపాదిస్తే ప్రజలు వానిని మెచ్చుకొంటారు. వాని విద్యకు ఆనందిస్తారు. అనేకమంది వాని విద్యవల్ల జ్ఞానమూ, లాభమూ, ఆనందమూ పొందుతారు. భగవంతుడు అటువంటి వానిని మెచ్చుకొంటాడు. ఇహమందు, పరమందు వారు ఆనందం పొందగలుగుతారు. మీ కుర్రవాడు చదువుకొని నౌకరీయే యెందుకు చెయ్యాలి? ఏదో విద్యలో ప్రవీణుడై మీ వంశానికి కీర్తి సంపాదించగలడేమో! మీలో ఎవరికీ చదువు లేనేలేదు. ఉత్సాహమూ, తెలివీ ఉంది గనుక వాడినైనా చదివించడం మీకు ధర్మం. చదువో, చదువో అని యేడ్చేవాణ్ణి పశువులను కాయమనడం చాలా అన్యాయం' అని జగయ్య ముఖంలోకి చూచాను. నా ఉపన్యాసం నిష్ఫలం కాలేదు. చాలవరకు జగ్గయ్య మనస్సును మార్చింది. "ఏదో స్కూలు ఫైనలువరకూ అయితే డబ్బు పెట్టగలమనుకోండి. ఆ తరువోత వందలు కావాలంటే ఎక్కడినుండి తేగలమండి డబ్బు" అన్నాడు. "ముందు అంతవరకూ చదివించు. ఆ తరువాత వాడితోవ వాడే చూచుకొంటాడు. చదువులో మొదటివాడుగా ఉంటే గవర్నమెంటే యిస్తుంది వాడి చదువుకి డబ్బు." "అలాగాండి? మీ రెందుకు సెప్పారో, వచ్చేయేడు మీ స్కూల్లో జేరిపిద్దాం లెండి. కూలింత కనిపెట్టి

నూత్తోండాలి మీరు" "అలాగే, వచ్చే వేసంగుల్లో రణ్ణెల్లా నా దగ్గరకు పంపిస్తూండు. ఇంగ్లీషు, లెక్కలు చెప్పి సెకండు ఫారంలో చేర్పిస్తాను." "నిత్తం, అలాగేనండి" అన్నాడు. మిగిలిన పెద్ద మనుషులు 'తెలివైనవాడైతే తప్పకుండా చెప్పించవలసిందే చదువు' అని ఒకరూ, 'ఈ రోజుల్లో చదువు తప్పకుండా ఉండవలసిందేనయ్యా' అని ఒకరు తలోకరీతిగా నిర్ణయాన్ని బలపరిచారు.

* * *

ఆ తరువాత వేసంగుల్లో రెండు నెలలూ సుబ్బారావు నా దగ్గరకి వచ్చేశాడు. స్కూలు తెరిచాక వాణ్ణి సెకండు ఫారంలో చేర్పించాను. ఆ తరువాత కూడా వాడు రోజూ ఉదయమూ, రాత్రీ రావటం, బళ్లోకి కావలసిన విషయాలు నేర్చుకొంటూ ఉండటం జరుగుతోంది సెకండు ఫారంలోనూ, థర్డు ఫారంలోనూ ఫస్టు మార్కులు వాడివే. నిరుడు హెడ్‌మాస్టరు గారితో చెప్పి, గవర్నమెంటు స్కాలర్ షిప్పుకు దరఖాస్తు పెట్టించాను. స్కాలర్ షిప్పు యిస్తున్నారు. తరువాత ఒకనాడు ఉదయం, సుబ్బారావు రోజూ కంటె ఆలస్యంగా వచ్చాడు. రోజూ ఉండే ఉత్సాహం వానిలో లేదు. ముఖం వివర్ణంగా వుంది వచ్చి అరుగు మీద కూర్చుని మాట్లాడకుండా పుస్తకంలోని కాగితాలు తిరగేస్తున్నాడు. "ఏమిరా, అలా వున్నావేం?" అని ప్రశ్నించాను. పొంగివచ్చే దుఃఖాన్ని దిగమ్రింగుతూ "ఏం లేదండి" అన్నాడు. "ఏమీ లేదంటావేమిటి, వంట్లో బాగాలేదా?" "బాగానే ఉందండి" "అయితే అలా యేడుపు ముఖం పెట్టావెందుకు? ఇంటి దగ్గిర దెబ్బలు తిన్నావా?" వాడు మాట్లాడలేదు. తల వొంచుకొని కూర్చున్నాడు. "చెప్పు మరి, యేం జరిగిందేమిటి?" అని మళ్ళీ ప్రశ్నించాను. "మా బాబూ, పెద్దన్నా తిట్టారండి. మా పెద్దన్న కొట్టాడు కూడానండి." "ఎందుకు?" "మాస్టారుకి ట్యూషన్ ఫీజు యివ్వమన్నానండి" "ఎందుకడిగావ్? నేను నిన్ను అడగమన్నారా?" "లేదండి, నేనే అడిగానండి" "నేను చెప్పనిదే ఎందుకడిగావురా? ఊఁ, అడిగితే యేమన్నారు?" "మీ మేస్టరు అడగమన్నారా? అన్నారండి లేదన్నానండి. అయితే డబ్బు యెక్కడ పడి మూలుగుతోందనుకొన్నావా! అని బూతులు తిట్టి మా పెద్దన్న కొట్టాడండి. ఇంతోటి యెదవ చదువుకి ట్యూషను ఫీజు కూడానా, మానెయ్ ఆయనదగ్గరి కెళ్ళటం అని మా బాబు తిట్టాడండి." "సరే, యింకెప్పుడూ ట్యూషను ఫీజు కావాలని అడగకు." "మరి గోపాలం, వెంకట్రావూ యిస్తున్నారు కాదండీ" "వాళ్ళ పెద్దవాళ్ళకు చదివించాలని ఉంది కనక డబ్బిచ్చి చదివిస్తున్నారు. మీ వాళ్ళకు నువ్వు చదవటమే యిష్టం లేనప్పుడు చదువు కోసం డబ్బెలాగ యిస్తారు?" "మరెలాగండి?" అన్నాడు తలవంచుకొని కళ్ళనీళ్లు తుడుచుకొంటూ. వాని అమాయకమైన ప్రశ్నకు నాకు జాలి కలిగింది. "ఏమీ లేదు, నువ్వు వచ్చి చదువుకొంటూ వుండటమే చదువుకొనేవాళ్లంతా డబ్బు యివ్వగలరా? కొంత మందికి మేము ఉచితంగా కూడా చెబుతూండాలి. ఇవ్వటం పుచ్చుకోవటం గొడవ నీకెందుకు? నువ్వు వచ్చి చదువుకొంటూ వుండు'' అని మందలించాను.

* * *

మరి రెండురోజులు గడిచాక సుబ్బారావు తన వాడుక ప్రకారం తెల్లవారేముందు లేచి యింటికి వెళ్ళాడు. మళ్ళీ యేడుగంటలకి వచ్చాడు. వాడు చెయ్యవలసిన లెక్కను తెలియజెబుతూ నేను అరుగు మీద కూర్చున్నాను. మా రాధ "ఒకసారి లోపలికి రండి"—అని పిలిచింది. నేను వీధి గుమ్మం దగ్గరకు వెళ్ళి 'ఏం?' అన్నాను. "బియ్యం మాటేమిటి? మొన్నా నిన్నా అప్పు చేశాను." అంది. "ఈ పూటకి కూడా ఎక్కడో తెప్పించు. సాయంకాలానికి ఎక్కడో తడుముతాను డబ్బు. ఇంకా వారానికిగాని రావు జీతాలు" అన్నాను. రాధ లోపలికి వెళ్ళిపోయింది. లెక్క సగం సగం చెబుతూ లేచి వచ్చాననే సంగతి మరచి అరుగుమీద పచారు చేస్తున్నాను. నా రాబడి గోచీకి ఎక్కువ గోణానికి తక్కువ లాంటిది. పూర్తిగా చావనియ్యదు, పూర్తిగా బ్రతకనివ్వదు. నెలకు అరవై ఒక్క రూపాయికి అణా తక్కువగా కడిగి చేతిలో పెడతారు. సంవత్సరం చివరి భాగంలో రెండుమూడు నెలలు ట్యూషన్లవల్ల నెలకు యిరవయ్యో పాతికో వస్తాయి. జీతం వచ్చిన రెండో రోజునుండీ ఒక రూపాయి మొదలు పది రూపాయల వరకూ అప్పులు చేస్తూ కాలక్షేపం చెయ్యడం మళ్ళీ జీతం రాగానే అప్పులు తీరుస్తూండడం పరిపాటి. ఈ రోజున చేబదులు ఎవరిని అడగటమా అనే ఆలోచనతో కొంతసేపు అరుగుమీద పచారు చేశాను. ఆలో

చవకు అంతు దొరకలేదు. ఇంతలో నా దగ్గర చదువుకొనే కుర్రాడు గోపాలం గుమ్మంలోకి వచ్చాడు. వాడి ట్యూషన్ ఫీజుకోసం వాళ్ల నాన్నగారి దగ్గరకు పంపిద్దామనే ఆలోచన కలిగింది. కాని ఇంకా వారం గడిస్తేనే గాని నెల పూర్తి కాదు. అయినా తప్పదు అనుకొని "గోపాలం! మీ నాన్నగారి దగ్గరకు వెళ్ళి నేనిమ్మనని ట్యూషనుఫీజు తీసుకోనిరా, కొంచెం అవసరం ఉండి ముందుగా అడిగానని చెప్పు మీ నాన్నగారితో" అన్నాను. వాడు తలూపి పుస్తకాలు అరుగుమీద పెట్టి ఇంటికి వెళ్లాడు. ఇప్పటికి సుబ్బారావుకి లెక్క చెప్పాలని జ్ఞాపకం వచ్చింది. వాడు ఇంతసేపూ మాట్లాడకుండా నా వ్యవహారమంతా కనిపెడుతూ కూర్చున్నాడు కాబోలు. నేను యథాస్థానంలో కూర్చుని లెక్క చెబుతున్నాను. వాడు తలూపుతున్నాడే గాని నే చెప్పేది వింటున్నట్లు తోచలేదు. 'ఏంరా, అయిదుగురు మనుష్యులకు ఇరవై రోజులకు సరిపడే బియ్యమున్నాయి. అదే బియ్యం పదిమంది తింటే ఎన్ని రోజులకు వస్తాయి? రోజులు తగ్గుతాయా పెరుగుతాయా?" అని అడిగాను. నేను వేసిన ప్రశ్న వాడు వినలేదు కాబోలు, నా ప్రశ్నకు జవాబు చెప్పకుండా 'అయ్యా' అని ఊకొట్టేడు. "అదేమిరా, నా ప్రశ్నకు సమాధానం చెప్పకుండా ఊకొడుతున్నావేమిటి?" అన్నాను. "ఏమిటండీ?" అన్నాడు. "నీ తలకాయ" అని చిరాకు పడి మళ్లీ ప్రశ్న వేశాను. "రోజులు తగ్గుతాయని జవాబు చెప్పాడు. లెక్క పూర్తిగా చెప్పి చెయ్యమన్నాను. తప్పుచేసి చూపించాడు. నాకు ఆశ్చర్యం కలిగింది. నేను బోధించిన విషయం వాడు తప్పుచేసి చూపడం ఇది మొదటిసారి. మళ్ళీ బోధించిన తరువాత లెక్క సరిగా చేశాడు. ఇంతలో గోపాలంవచ్చి "రేపు ఇస్తానన్నారండి" అన్నాడు. "ఉహుఁ" అని ఒక చల్లని నిట్టూర్పు విడిచాను. ఇలాంటి ఆశాభంగాలు నాకు బాగా అలవాటే.

* * *

ఆ రోజున నేను ఇంటికి వచ్చేటప్పటికి బాగా చీకటిపడింది. అప్పటికప్పుడే సుబ్బారావువచ్చి అరుగుమీద కూర్చుని చదువుకొంటున్నాడు. నేను కాళ్ళూ చేతులూ కడుక్కొని గదిలో బట్టలు మార్చుకొంటున్నాను. ఎదురుగా మంచంమీద యేదో కాగితంలా కనుపించింది. తీసి చూశాను. ఆశ్చర్యం కలిగింది. అది పదిరూపాయల నోటు. 'రాధా' అని పిలిచాను. గది గుమ్మంవరకూ వచ్చినరాధ "అదేమిటి, ఎక్కడ పుట్టించుకొచ్చారేమిటి డబ్బు?" అంది. "ఎక్కడా పుట్టక వాజముఖం వేసుకొని నేనొస్తే! ఇదెలా వచ్చింది మంచంమీదికి? నువ్వు పడేయ్యలేదూ?" "నేను అక్కడెందుకు పడేస్తాను? అయినా పది రూపాయలు నా కెక్కడనుంచి వచ్చాయి?" అంది. కొంతసేపు మౌనంగా యిద్దరం ఆలోచిస్తూ నిలబడ్డాం. "గోపాలంగాని వచ్చాడా?" అన్నాను. "అబ్బే, రాందే! నేను దానిమీద పక్క దులిపి వేసి ఒక అరగంట అయింది. ఈలోగా సుబ్బారావూ మీరూ తప్ప యింకెవరూ రాలేదు" అంది రాధ. ఈ మాటతో ఇది సుబ్బారావు చేసినపనే అని నాకు దృఢపడసాగింది. నెమ్మదిగా వీధి అరుగుమీదకు వెళ్ళాను. సుబ్బారావు తల వాల్చుకొని లాంతరు ముందు కూర్చున్నాడు. పుస్తకంలో పేజీలు తిరగేస్తున్నాడు. "సుబ్బారావూ, గోపాలం వచ్చాడా?" అన్నాను. "లేదండి" అని తల ఎత్తకుండానే జవాబు చెప్పాడు. పేజీలు యిటూ అటూ తొందరగా తిరగేస్తున్నాడు. "ఈ పది రూపాయలనోటు నువ్వు పడేశావా మంచంమీద" "ఏటండీ?" అని ఒకసారి తలెత్తి మళ్లీ వాల్చాడు. "పరవాలేదులే, కంగారు పడకు. ఎక్కడిది నీకీనోటు?" "లేదండి, లేదండి నేను కాదండి" అని కంగారుగా అన్నాడు. "ఒరేయ్, ఇలా చూడు, నువ్వు ఇంతవరకూ ఎప్పుడైనా అబద్ధమాడావా? ఈ రోజుతో నీమీద నాకుండే నమ్మకం, అభిమానం, ప్రేమా, అన్నీ పోతాయి తెలుసా? నువ్వు అబద్ధమాడావంటే నన్ను మోసగించావన్నమాట నన్ను ఎప్పుడైతే మోసగించడానికి సిద్ధపడ్డావో అప్పుడింక ప్రపంచంలో ప్రతివాణ్ణీ మోసగించగలవు. మోసగించి చేసేపనులేమిటో తెలుసా?— దొంగతనం, లంచగొండితనం, జూదం, వ్యభిచారం, ఇవన్నీ మోసంమీద ఆధారపడి జరుగుతూంటాయి. నువ్వు మామూలుగా మా యింటికి రాదలచుకొంటే యథార్థం చెప్పు. లేదా యీ నిమిషంలో నే నువ్వు మా అరుగు వదలిపెట్టవలసివస్తుంది." అని కొంచెం తీవ్రంగా అన్నాను. వాడు బిక్కముఖం వేసి "నేనే నండి" అన్నాడు. "అయితే ఎక్కడి

నుంచి తెచ్చావ్?" "మా బాబు పెట్టెలోదండి" "అంటే యెవరికీ తెలీకుండా దొంగతనంగా తెచ్చావన్నమాట?" అని గద్దించాను. వాడు మాట్లాడలేదు. తలవొంచుకొని కళ్లు తుడుచుకొంటున్నాడు. "సరే అయిందేదో అయింది. తెల్లవారు ఝామున ఈనోటు తీసుకెళ్ళి ఎక్కడనుంచి తీశావో అక్కడే జాగ్రత్తగా పెట్టు. ఇంక ముందెప్పుడైనా ఇలాంటిపని చేశావా, మా గుమ్మం ఎక్కనివ్వను, జాగ్రత్త!" అని మందలించి లోపలికి భోజనానికి వెళ్లాను.

మరునాడు వెల్తురురాకుండా సుబ్బారావు పది రూపాయల నోటుతీసుకొని వెళ్లాడు. కాని ఆ రోజున మళ్లీ మాయింటికీ రాలేదు, బడికీ రాలేదు. వాళ్ల యింటికి సమీపంలో ఉండే పిల్లవాడొకడు స్కూల్లో చదువుతున్నాడు. "సుబ్బారావు రాలేదెంచేత?" అని వాని నడిగాను. "పెట్లో డబ్బుడీశాట్టండి, వాళ్ల బాబు చావకొట్టేశాడండి. ఏడుస్తూ కూర్చున్నాడండి." అని చెప్పాడు. నా మనస్సు పరిపరివిధాల పోయింది. నేనే ప్రేరేపించి డబ్బు దొంగతనంగా తెప్పించానని వాళ్లు అపోహపడితే? నా బ్రతుకు నవ్వులపాలౌతుంది. ప్రతీవాడూ వేలెట్టి చూపిస్తాడు నన్ను. ఆ రోజున క్లాసుల్లో పాఠాలు చెప్పకుండానే కాలక్షేపం చేశాను. బడి వదలగానే యింటికి వచ్చి కుర్చీలో కూలబడ్డాను. రాధ "ఏమిటి, అలా ఉన్నారేం? వంట్లో బాగాలేదా?" అని అడిగింది సుబ్బారావు సంగతంతా చెప్పాను. "ఓస్, యింతేనా! మనం వాణ్ణి డబ్బు తెమ్మంటేగా, భయపడ్డం బాధపడ్డమూను? ఇదేమిటండీ, ప్రతీ చిన్న విషయానికీ తలగట్టుకుని కూర్చుంటారు?"అని సాగదీసింది ఎగతాళిగా. ఇంతలో "మేష్టారూ!" అని వీధిలో కేక. నా గుండెలు దడదడలాడాయి.

అది జగ్గయ్యగొంతుక. మా రాధ వెంటనే వీధిలోకి నడిచింది. జగ్గయ్య మా అత్తవారింటికి ఎదురింటివాడవడంచేత, తరచు మావాళ్ల అరుగుమీద కూర్చుంటూ వుండడంవల్ల మారాధకు చిన్నప్పటినుండీ అతని దగ్గర చనువు యెక్కువ. "ఏం బాబా, ఇలావచ్చావ్" అంది. "మేష్టారేరి రాధమ్మా?" అన్నాడు బిగ్గరగా. అంతవరకూ బయటకు వెళ్ళడమూ మానడమూ అని సందేహిస్తూ వాకిట కుర్చీలో కూర్చున్న నేను శ్వాసగట్టిగా గిలా గొంతుక సవరించుకొంటూ వీధి గుమ్మంలోకి వెళ్లాను. "ఏమయ్యా! మీరింతవరకూ పెద్దమనిషి వనుకొన్నాను. ఇదేం పనయ్యా, కుర్రాడిచేత దొంగతనంగా డబ్బు తెప్పిత్తావా?" అన్నాడు జగ్గయ్య. ఈ మాటలు వినేటప్పటికి నాకు కోపమూ ఆవేశమూ కలిగి శరీరమంతా కంపించింది. వాటి వెనువెంటనే దుఃఖం పొంగివచ్చింది. అన్నింటినీ అణచుకొని "ఎంత మాటన్నావు జగ్గయ్యా, నన్నెరగవూ నువ్వు?" అన్నాను. "ఎరక్కేం బాబూ! ఇప్పటికి బాగా తెలుసుకొన్నాను. మెత్తగా తియ్యగా మాట్టాడే వోళ్ళే కొంపతీసేత్తారు." నాకు ఆవేశం తీవ్రమయి నోటమాట రావడంలేదు. కాని మారాధ నాఅంత చేతగానిది కాదు. "కారణం లేకుండా నిందమోపడం చాలా దుర్మార్గం. విషయం పూర్తిగా తెలుసుకోకుండా నీ నోటికి వచ్చినట్లల్లా మాట్లాడుతున్నావు. మీకుర్రాడు నీతో యేంచెప్పాడు? మేం డబ్బు తెమ్మన్నామని చెప్పాడా?" అని ధీమాగా అడిగింది రాధ. "ఇంకేం చెప్పాలమ్మా, మాట్టోరుకోసం తీశానని చెప్తేను?" అని గర్జించాడు. "మాస్టారుకోసం తీశానని వాడు చెప్తే మేస్టారు తెమ్మన్నారని అర్థం చేసుకొన్నా వన్నమాట" అంది రాధ. "ఈయన చెప్పకపోతే ఆడెందుకు తెత్తాడు?" అని స్వరం తగ్గించాడు. మనస్సు ఆలోచనలో పడ్డంచేత కాబోలు. మనిషిలో ఉద్రేకం తగ్గింది. "నీయిష్టంవచ్చినట్లు ఊహించుకొని మామీదకు జగడానికి రావడం చాలా పొరపాటు. వెళ్ళి వాణ్ని వివరంగా అడుగు తెలుస్తుంది" అన్నాను నేను ప్రయత్నంతో. "వాడు డబ్బుతీసినట్లు ఎప్పుడు తెలిసింది నీకు?" అంది రాధ. "ఎప్పుడు తెలియడమేంటి, రాత్రే తెల్చింది. కూలోళ్లకి డబ్బు యిద్దామని పెట్టి తెరిత్తినిగదా, పెట్టి గల్లంతుగా ఉంది. అనుమానం కలిగి డబ్బు లెక్కెట్టుకొంటే పదిరూపాయలు తక్కువొచ్చాయి. పొద్దున్నే ఈయడవని అడిగితే తెల్లమొగం పెట్టి నోటు చేతికిచ్చాడు" అన్నాడు. "అయితే రాత్రి నేను తెప్పించుకొన్న డబ్బు వాడు మళ్ళీ ఇంటికి యెందుకు పట్టుకొచ్చాడు?" అన్నాను నేను.

"యేమో! యెందుకు తీశావురా అంటే, మేష్టారికోసం అన్నాడు. నోటు పుచ్చుకొని యెదవని సావగొట్టి సెవులు మూశాను" అన్నాడు మెత్తబడి. "మంచిపని చేశావ్? వాడు యెందుకు తీశాడో,

యేం చేశాడో, మాస్టారికోసం తీసుకెళ్ళిన డబ్బు మళ్ళీ యెందుకు తెచ్చాడో తెలుసుకోకుండా వాణ్ణి చావగొట్టి మా మీదికి యుద్ధానికి వచ్చావా? వాణ్ణి బళ్ళో జేరిపించి, గవర్నమెంటు స్కాలరుషిప్పు యిప్పించి మూడేళ్ళనుంచి వాడివల్ల కానీ ఆశించకుండా చదువు చెబుతూన్నందుకు మంచి ప్రతిఫలం ముట్టజెప్పావు? చాలు, చాలు, ఉపకారానికి పోతే అపకారం యెదురుగా వస్తుంది." అని కఠోరంగానూ నిష్ఠూరంగానూ అని రాధ చరచరా లోపలికి పోయింది. ఏమనుకున్నాడో యింక జగ్గయ్య మాట్లాడలేదు. "మేం చెబితే నీకు నమ్మకం కలగడం కష్టం, వెళ్ళి నెమ్మదిగా వాణ్ణే అడుగు సమస్తం చెప్తాడు" అన్నాను. మరి మాట్లాడకుండా చివాలున లేచి వెళ్ళిపోయాడు జగ్గయ్య.

* * *

ఆ మరునాడు ఉదయమే నేను వీధి గుమ్మంలోకి వచ్చేటప్పటికి పుస్తకం చేతిలో పట్టుకొని అరుగు మీద కూర్చున్నాడు సుబ్బారావు. "ఏమిరా, ఇంత రభస జరిగినా ఇంకా నన్ను వదలిపెట్టవా?" అన్నాను యథాలాపంగా. వాడు మాట్లాడలేదు. "మీ బాబుతో చెప్పి వచ్చావా?" "మా బాబే వెళ్ళమన్నాడండి" "నువ్వు మీ బాబుతో యేమని చెప్పావ్?" "ఏమీ చెప్పలేదండి. పెట్టిలో డబ్బు తీశావా అని అడిగాడండి. జేబులోంచి నోటుతీసి యిచ్చానండి. ఎందుకు తీశావని తిట్టాడండి. మేస్టారు డబ్బుకి చాలా యిబ్బంది పడుతున్నారు, వారికి యివ్వాలని తీశానన్నానండి. అంతేనండి. తిట్టి కొట్టేడండి." "నేను తెమ్మన్నానని చెప్పలేదూ?" "లేదండి, లేదండి," అన్నాడు బిక్క మొహంతో. "నిన్న సాయంత్రం మళ్ళీ నిన్ను యేమని అడిగారు?" "మీ మేష్టారు డబ్బు తెమ్మనలేదా?" అన్నాడండి. లేదని చెప్పానండి. అయితే యెందుకు పట్టుకెళ్లావ్? అన్నాడండి. ఆయన ఇబ్బందిపడుతున్నారు. అంచేత ఇద్దామని పట్టుకెళ్లాను అని చెప్పానండి. నాతో యెందుకు చెప్పలేదన్నాడండి. చెబితే తిడతావని చెప్పలేదు అన్నానండి. నాకు తెలియకుండా, ఇంట్లోది యేదైనా తీశావంటే తవ్వి పాతరేస్తానన్నాడండి." అన్నాడు. వాడు చెప్పే విధానం చూస్తే నాకు నవ్వువచ్చింది. అమాయకమైన వాడి మాటలకు జాలీకలిగింది. "మా యింటికి వెళ్ళవద్దని చెప్పలేదూ మీ బాబు?" అని అడిగాను. "లేదండి, పొద్దున్నే మాస్టారు దగ్గరకి వెడతానన్నానండి." సరే, యెళ్లు, యెదవపన్లేమీ చెయ్యక జాగ్రత్తగా ఉండు, లేకపోతే చదువు మానిపించి దూళ్లకాడ పెడ్తాను అన్నాడండి" అని హావభావాలు వెల్లడిస్తో చెప్పాడు. తను విన్న సంగతీ చూచిన సంగతీ సంభాషణ క్రమంతో తు చ తప్పకుండా బిడియపడకుండా అమాయకంగా చెప్తాడు సుబ్బారావు. వాని అమాయకత్వానికీ, నామీద వానికుండే భక్తి శ్రద్ధలకూ నా మనస్సు కరిగి నీరయింది. నిన్న, జగ్గయ్య అన్న మాటలకు ఇంక వీణ్ణి గుమ్మంలోకి రానివ్వకూడదని నిర్ణయించుకొన్నాను. కాని ఇప్పుడు వాని ముఖం చూడగానే నా నిర్ణయం పట్లు తప్పింది. వాని అమాయకమైన మాటలు వింటూ జగ్గయ్య మాటలు మరచిపోయాను. వాడు దొంగతనంగా డబ్బు తేవడానికి కారణం ఊహించుకొంటే నాకు కళ్లనుండి అశ్రువులు రాలుతున్నాయి. ఇంతలో మా రాధ బయటికి వచ్చింది. "ఏమిరా, పొద్దున్నే సిద్ధమయావ్? ఇంక నువ్వు మా యింటికి రాకు నాయనా. ఈ వచ్చిన నింద, అప్రతిష్ఠ చాలు మాకు అంది. "వాడేం చేశాడే?" అన్నాను నేను ఊరుకోలేక. "ఇన్ని చివాట్లూ తిని వాడేం చేశాడంటారేమిటి? వాడిమూలాన్నే కాదూ యీ రభసంతా?" అంది రాధ. "వాళ్ళ బాబుని నువ్వు యెరగవా యేమిటి? దూరం ఆలోచించకుండా ముందు ప్రతీ విషయానికీ అగ్గిలా భగ్గుమంటాడు. తరువాత నిజం తెలుసుకొని నీళ్లౌతాడు. అతనిమీది కోపాన్ని, కక్షనూ వీడిమీద చూపిస్తే యెలాగ?" "ఇలా ప్రతీ విషయంలోనూ మెత్తమెత్తగా ఉంటే నెత్తికెక్కుతారు. ఏమీ లేని దరిద్రుడిమీద యీ కనికరం చూపిస్తే, వాడు జన్మాంతం సేవ చేస్తాడు. అయిందేదో అయిపోయింది. ఇంకనైనా వదలుకోండి వీణ్ణి." అని తీక్షణంగా మాట్లాడింది. ఆమె మాట్లాడే ప్రతీ మాటా నా హృదయాన్ని కలచివేస్తోంది ఎంచేతనో. మాటిమాటికీ సుబ్బారావువైపు చూస్తున్నాను ఆమె మాటలు వినడం కష్టమైపోయింది నాకు. నేను కలవరపాటుతో "ఆఁ, ఆఁ! కట్టిబెట్టు మాటలు. మరేమీ మించిపోయిందిలేదు." అని చిరాకుపడ్డాను. తీర్పు

చెప్పబోయేముందు న్యాయమూర్తి ముఖంకేసి చూస్తున్న ముద్దాయివలె, వాడు మా సంభాషణ పర్యవసానం యేమి తేల్తుందో అని బెదురు చూపులతో కూర్చున్నాడు. ఆమె మాటలకి వాడి లేత హృదయం దుఃఖిస్తుందని నా ఆందోళన. ఆమె ఇంకా మాట్లాడితే దగ్గరకు వెళ్లి చేత్తో నోరు మూసేద్దామనిపించింది నాకు. "సరే మీ ఇష్టం. మీకు లేని అభిమానం ఆత్మగౌరవం నాకెందుకు?" అంటూ లోపలికి వెళ్ళిపోయింది రాధ. ఆమెను సముదాయించడానికి నేనూ లోపలికి వెళ్లాను. "ఇప్పటికే వాడు కుమిలి కుమిలి యేడుస్తున్నాడు. పాపం వాడు చేసిన అపరాధమేమిటి? మనమీద ఉండే భక్తి విశ్వాసాలవల్ల, మనం యిబ్బంది పడుతుంటే చూడలేక డబ్బు యెత్తుకొచ్చాడు. వాణ్ని చూస్తుంటే నీకు గుండె నీరవడం లేదుటే?" అన్నాను. నా మాటలతో ఆమె కొంచెం నిజం తెలుసుకొందనుకొంటాను. "ఔననుకోండి. మరి వాడిమీద జాలిపడి మన పరువూ ప్రతిష్ఠా పోగొట్టుకొంటామా?" అంది. "జగ్గయ్య నిజం తెలుసుకొన్నాడుగా? మనల్ని అన్నమాటలకు పశ్చాత్తాపపడి ఉంటాడు. అంచేతనే ఉదయాన్నే కుర్రవాణ్ణి చదువుకొందుకు పంపించాడు. ఎవరెన్ని అన్నా, ఎంత అపకీర్తి వచ్చినా వాణ్ణిమాత్రం వదల్లేను రాధా!" అన్నాను ఉద్వేగంతో. ఆమె ఒకసారి నా ముఖంలోకి చూచింది. 'అయ్యో అదేమిటండీ, అలా బాధపడతారు? నేనేం తప్పుగా మాట్లాడలేదే!' అని ఆమె అన్నతరువాత తెలుసుకొన్నాను నా కళ్లు నీళ్లతో నిండాయని. చివాల్న ముఖం తిప్పుకొని గదిలోకి పోయి మంచంమీద వాలాను.

* * *

ఆ రోజున బడికి సెలవైన కారణంచేత యింటిదగ్గరే ఉన్నాను. మధ్యాహ్నం మా మామగారు వచ్చారు. "ఏమిటోయ్, యీ లేనిపోని గొడవ? ఆ కుర్రవెధవకోసం నీ పరువు పోగొట్టుకొంటున్నావు. మళ్లీ యెందుకు రానిచ్చావ్ వాణ్ని?" అని ప్రారంభించారు. "పాపం, వాడేం చేశాడండీ? జగ్గయ్య దూరమాలోచించకుండా తొందరపడ్డాడు. ఇప్పుడు నిజం తెలుసుకొన్నాడులెండి" అన్నాను. "అతడేం తెలుసుకొన్నాడో నాకు తెలియదుగాని, ఊరూ వాడా నువ్వు దొంగతనంగా డబ్బు తెప్పించావని గోలగా ఉంది. ఆ జగ్గయ్య కొడుకులు, పెద్దాడూ రెండోవాడూ నిన్న నానా మాటలూ అంటూంటే నేను విని ఎలా ఊరుకోగలను? వాళ్లకి యేమైనా మంచీ చెడ్డా విచక్షణ ఉంటేగా? వట్టి పసువులు."

ప్రొద్దుట సుబ్బారావు మా యింటికి రావడంతో గొడవ సమసిపోయిందనుకొన్నాను. కాని యిప్పుడు మామగారు చెప్పే మాటల్ని బట్టి గొడవ యింకా మొదట్లోనే వుంది. ఈయన వాళ్ళతో యేదో ఘర్షణ పడినట్లుకూడా ఈయన మాటలవల్ల వెల్లడవుతోంది. అకారణంగా నిందలపాలు కావలసి వస్తోందని మనస్సు బాధపడసాగింది. "జగ్గయ్య యేమన్నాడండీ?" అన్నాను. "అతనేమీ మాట్లాడలేదనుకో. కాని వాళ్లు అడ్డమయిన కూతలూ కూస్తుంటే తను బుద్ధి చెప్పొద్దూ?" "అయితే వాళ్లకి జరిగిన యథార్థ విషయం తెలియదన్నమాట?" "నేను గంటసేపు కంఠం చించుకొని వాదించి చెప్పాను. అతనూ చెప్పే వుంటాడు. చెప్పినా అర్థం చేసుకోలేని మూర్ఖులు. అతని మాటమాత్రం వింటారా వాళ్లు?" "నిజం తెలిసీకూడా నన్ను ఎందుకు నిందిస్తున్నారంటారు?" "ఎందుకేమిటి మొరటు వెధవలకి, అసలు వాళ్ళకి వాడుచదువుకోవడం యిష్టంలేదు." ఇప్పటికి విశదమయింది నాకు విషయం. తమ్ముడిమీద వుండే ఈర్ష్య, ద్వేషంచేత, యీ అవకాశాన్ని దొరకపుచ్చుకొని తమ అక్కసు తీర్చుకొంటున్నారని నాకు స్పష్టపడింది. వాడి చదువుకి ప్రోత్సాహమిస్తున్న వాణ్ని నేనేగనుక, వాళ్లకి వాడిమీద వుండే ద్వేషం నామీదకూడా కలగడం సహజం. ఇంతకుముందు చాలాసార్లు వాళ్లు సుబ్బారావుయెడల అన్యాయంగానూ దుర్మార్గంగానూ ప్రవర్తించడం, వాడు నాతో చెప్పుకొని యేడవడం కూడా జరిగింది. వీడు యేడుగురు అన్నదమ్ములలో మధ్యవాడు. వీడి గోడు వినేవాడుగాని, వీని బాధ గ్రహించగలిగే వాడుగాని ఆ కొంపలో లేడు. మాయా మర్మం తెలియని పసివానిమీద వాళ్ళకెందుకో అంత ద్వేషం నాకు అర్థంకాలేదు. తల్లి, తండ్రి, అన్నలు, తమ్ములు ఉండి తగినంత ఆస్తి ఉన్నవాళ్ల కడుపున బుట్టి వాడు దిక్కుమాలిన కుక్కలాగా చివాట్లూ చెప్పుదెబ్బలూ తింటూ నాబోటి నిర్భాగ్యుని ప్రేమకు ఆదరణకు పాత్రుడు కావలసివచ్చింది. వానిస్థితికి నా హృదయం శతధా భిన్నమౌతోంది.

కాని నామీద వాళ్ళుచేసే దుష్ప్రచారాన్ని అరికట్టడమెలాగ? బహుశా వాడిని చదువు మానిపిస్తే వాళ్ల యీర్ష్య, ద్వేషం తగ్గవచ్చు. వాళ్లలాగే వీడుకూడా దున్నపోతులా తయారుకావాలి. అప్పుడు వాళ్లమనస్సు కుదుట బడవచ్చు. కాని రాత్రింబగళ్లు చదువుకోసం పరితపిస్తూ ఉండే వాడిచేత చదువు మానిపించడమెలాగ? ఏమీ తోచలేదు. నాకు ఎదురుగా ఉన్న మామగారినే ప్రశ్నించాను — "అయితే, ఇప్పుడేం చెయ్యాలి?" అని. ఇంతవరకూ మా ప్రసంగంలో యేమీ కలుగజేసుకోనకుండా గుమ్మందగ్గర నిలబడ్డరాధ — "వాడికి చదువు చెప్పడం మానుకోవడం తప్పదండీ" అంది. "దానికి పెద్ద ప్రయత్న మేముంది? ఇంక నేను చదువు చెప్పను పొమ్మని చెప్పు" అన్నారు మామగారు. ఆ మాట వాడితో చెప్పడం అసంభవ మని నాకు తెలుసు. ఈ, నా అంతరంగిక విషయాన్ని తెలియజేస్తే, మామగారు హేళనచేసి, నీకు మతిలేదా అని అంటారని కూడా నాకు తెలుసు. అంచేత ఆయన్ని తృప్తిపరచడానికి "అలాగే లెండి" అన్నాను. "దీనికింకా సందేహమెందుకు? అయ్యో వాడిచ్చే పదిరూపాయలూ పోతాయన్న బెంగా? పొమ్మను వెధవని" అన్నాడాయన. నేను తలూపాను.

* * *

ఆ రాత్రి, మరుచటిరోజున కూడా సుబ్బారావు మాయింటికి రాలేదు. ఆ మరునాడు స్కూల్లో ముగ్గురు ఉపాధ్యాయులు నా అంతరంగిక మిత్రుల్లాగ చాటుకి పిలిచి "ఏమిటయ్యా, ఇలాంటి గొడవ బయలుదేరింది? ఆ సుబ్బారావు గాడిచేత నువ్వు డబ్బు తెప్పించావనుకొంటున్నారేమిటి?" అని నేను అపవాదుకు గురియైనట్టు, తాము దానిని నమ్మక నాకు సానుభూతిని తెలుపుతూన్నట్టు మాట్లాడారు. నేను విషయ మేమీ మరుగుపరచకుండా ఉన్నదున్నట్టు వివరించి చెప్పాను. "అంతేలే, మేమూ అలాగే అనుకొన్నాం. మన మెంత నిజాయితీగా ఉన్నా ఒక్కొక్కప్పుడు లేని పోని గొడవలు వచ్చిపడుతూంటాయి" అని యేమేమో నన్ను ఓదారుస్తూన్నట్టు చెప్పారు. కాని వారు మాట్లాడే మాటలకీ వారి ముఖలక్షణాలకీ యేమీ సంబంధం నాకు కనుపించలేదు. వారు చెప్పినమాటలు పెదిమలమీదనుంచి వచ్చినవే కాని హృదయంలోంచి వచ్చినవి కావని నాకు స్పష్టంగా తెలిసింది. వారేమనుకొన్నా జరిగిన సంగతి యథార్థంగా చెప్పడం కంటె నేను చెయ్యగలిగిందేమీ లేదు.

ఆ మరునాడు ఉదయం ఎనిమిదిగంటలకు సుబ్బారావు మా యింటికి వచ్చాడు. వాణ్ణిచూడగానే నేను మెల్లగా ఇంట్లోకి వెళ్ళి మా రాధతో "వాడు వచ్చాడు. నువ్వు యేం చెప్పదలచావో చెప్పు" అన్నాను. "ఎవడు, సుబ్బారావా?" అంది. నేను తలూపాను. "నేను చెప్పడమేమిటండీ? మీరు చెప్పండి" "నేను చెప్పలేను, నువ్వు చెప్పు." "సరే, నేనే చెప్తాను. అని బైటికి వెళ్లింది. "ఒరేయ్! ఇంక మా యింటికి రాకు, ఆయన నీకు చదువు చెప్పరు." అని ఖచ్చితంగా చెప్పింది. ఆమాట వాడి మనస్సుమీద ఎంతగా పనిచేసిందో తెలియదు గాని, నా హృదయానికి శూలంలా తగిలింది. వాడు వెళ్ళలేక కాబోలు "చెప్పానుగా? వెళ్ళిపో!" అని చెప్పి తలుపు చేరవేసి లోపలికి వచ్చింది. ఒక అర గంటవరకు నేను వసారాలో పచారుచేశాను. వాడు వెళ్ళిపోయాడు, వాడి మనస్సు ఎంత బాధపడుతోందో? ఎంతగా యేడుస్తున్నాడో? అని ఊహించుకొంటూ మతి చెడినవానిలా అటు నిటు తిరిగాను. అలా తిరుగుతూ వీధిగుమ్మం తలుపు తెరచాను. హృదయ మాగినట్లయింది. వాడు వెళ్ళిపోలేదు. క్రింది గుమ్మంలో అరుగును ఆనుకొని తలవంచుకొని నిలబడి ఉన్నాడు. నేను తలుపు తెరవగానే నావైపు చూశాడు. 'సుబ్బారావ్' అని పలుకరించాను. వాడి కళ్లనుండి నీరు కారుతోంది. నేను అరుగుమీద పచారు చేయ నారంభించాను. రెండు నిమిషాలు వాడూ నేనూ మాట్లాడలేదు. తరువాత "మీ అన్నలకు నీమీద అంత కోపమెందుకు?" అని ప్రశ్నించాను. "ఏమో నండి ఎప్పుడూ యేదో వంకబెట్టి తిడుతూ కొడుతూ ఉంటారండి."

"మీ బాబూ అమ్మా యేమీ అనరా?" "వాళ్ల యెదుట యేమీ తిట్టరండి. నేను ఇక్కడికి వచ్చేటప్పుడో వెళ్లేటప్పుడో మా పొలందగ్గర కనుపిస్తారండి. పొలానికి రాలేదనో, అన్నం తేలేదనో, గేదెను తోలుకొని రాలేదనో తిడతారండి. ఇంకా కోపం వస్తే కొడతారండి." "వాళ్లు కొట్టారని మీ బాబుతో చెప్పవూ?" "గట్టిగా కొట్టినప్పుడు చెబుతానండి. నే నడుగుతాన్లే అంటాడండి మా బాబు. అడిగితే, వాళ్లు నేనేదో తప్పుచేశా నంటారండి. మా అమ్మ

వాణ్ణెందుకురా అలా కొట్టుకుంటారు అని అంటుందండి. 'నీకు తెలియదూరుకో వే ఈడి సదువుమూలాన పొగరెక్కి పోయాడు. ఇక్కడి సీపురిపుల్ల అక్కడ పెట్టమంటే పెట్టడు' అంటారండి. మా అమ్మ బాబూ వాళ్ళమాటలే నమ్ముతారండి". "పోనీ వాళ్ళు చెప్పిన పని కాస్తో కూస్తో చెయ్యకూడదూ?" "పనిచేస్తే బడీ చదువూపోదండీ? అయినా సెలవురోజున ఓ పూట పొలంలోనే ఉంటానండి. ఆ పూటల్లా పని సరిగా చెయ్యలేదని యెవడో ఒకడు తిడుతూంటాడండి."

"ఎవళ్లకీ యిష్టం లేనప్పుడు చదువు మానేసి ఆ పొలం పనులు చేసుకోకూడదూ?" "నాకు పొలం పని చెయ్యడమంటే యేడుపొస్తుందండి. రాత్రికి కాళ్ళూ చేతులూ లాగుతాయండి." "మరి యెన్నాళ్లని ఇలా బాధలు పడుతూ చదువుతావ్? నా మాట విని నువ్వు చదువు మానేస్తే నువ్వూ నేనూ కూడా సుఖపడతాం."

మీరేనా యీ మాటలంటూన్నది అన్నట్లుగా వాడొకసారి నా ముఖంలోకి చూచాడు. వాని చూపును తట్టుకోలేక ముఖం తిప్పుకొని పచారు చేయసాగాను. "వాళ్లు చంపినా చదువు మాననండి" అన్నాడు. నేను నివ్వెరపోయాను. అంత దుర్బలమైన శరీరంలో ఎంత నిబ్బరమైన గుండె ఉందా! అని. "నీ చదువుకి కారణం నేనే అని వాళ్లకి నామీద కోపం. అంచేత వాళ్ళు నామీద దుష్ప్రచారం చేస్తున్నారు. నేను నీచేత దొంగతనంగా రూపాయలు తెప్పించానని ఊరూ వాడా చెబుతున్నారు. నన్ను తిడుతున్నారుట కూడాను. అటువంటప్పుడు నువ్వు రోజూ మా ఇంటికి వస్తూండడం చదువుతూండడం జరుగుతూంటే నా పరపతి పోయి చివరికి ఉద్యోగం కూడా ఊడుతుంది." అని నా అంతరాత్మ నిరాకరిస్తూన్నా తప్పనిసరిగా చెప్పాను. ఈ మాటలు చెప్పేటప్పుడు నేను వాని ముఖం చూడలేదు. సంఘంలో నా గౌరవాన్ని లక్ష్యంలో పెట్టుకొని మాట్లాడాను. నా మాటలకు వాడు నిరుత్తరుడయాడు. ఇంతలో మా రాధ వచ్చి 'ఏమిరా వెళ్ళనేలేదూ?' అని 'తొమ్మిదిదాటుతోంది, మీరు స్నానం చెయ్యండి' అని చెప్పి లోపలికి వెళ్లింది. నేను నెమ్మదిగా లోపలికి వెళ్లాను. స్నానం భోజనం చేసి బట్టలు వేసుకొని బడికి బయలుదేరాను. సుబ్బారావు అక్కడే ఆ మెట్టుమీదనే నిలబడి ఉన్నాడు. "వేళయింది, బడికి నడు" అని నేను బయలుదేరాను. వాడు నా వెనువెనుకనే వచ్చాడు.

* * *

ఆ మరునాటి నుండి సుబ్బారావు నాదగ్గరకు చదువుకొందుకు రావడం మానేశాడు. కాని ప్రతి రోజూ నేను బడికి వెళ్లేముందు వచ్చి గుమ్మంలో నిలబడేవాడు. నేను బడికి బయలుదేరగానే నా వెనుకనే వచ్చేవాడు. మళ్ళీ బడి విడిచిపెట్టిన తరువాత నేను యింటికి బయలుదేరేవరకూ యెక్కడో కనిపెట్టుకొని ఉండేవాడు. నేను ఇంటికి బయలుదేరగానే నా వెనుకనే మా యింటివరకూ వచ్చి నేను యింట్లోకి వెళ్ళాక తను యింటికి వెళ్ళేవాడు. మధ్య త్రోవలో ఎప్పుడైనా నేను ఎవరితోనైనా మాట్లాడుతూ నిలబడితే తాను పది గజాల దూరంలో యేదో వేరేపని ఉన్నవాడిలా నిలబడేవాడు. ఒకొక్కప్పుడు బడి విడిచిన తరువాత అరగంట,గంటాకూడా నేను బడిలో ఆగేవాణ్ణి. ఇంతసేపూ ఎక్కడ ఉండేవాడో కాని నేను బయలు దేరగానే నా వెంటబడేవాడు. బడికి శలవైననాడుఉదయమొకసారి మధ్యాహ్న మొకసారి మా యింటిముందు వీధిలో పచారుచేసి పోతూండడం నేను చూశాను. "ఏమిరా, ఇలా వచ్చావ్?" అని రెండు మూడు సార్లు పలుకరించాను. "ఏమీ లేదండి" అని తలవంచుకొని వెళ్లిపోయేవాడు. మొదట రెండు మూడు రోజులు వాణ్ణి, ఏమని పలుకరించాలో, వాడితో యేమి మాట్లాడాలో నాకు అర్థం కాలేదు. వాణ్ణి యేమీ పలుకరించకుండానే నెమ్మదిగా బడికో యింటికో నడిచేవాణ్ణి. ఆ తరువాత "బాగా చదువుతున్నావా? ఇవేళ ఇంగ్లీషు యేం చెప్పారు? లెక్కలేం చెప్పారు? మొదలైన ప్రశ్నలు వేసేవాణ్ణి. నేను వేసే ప్రశ్నలకు సమాధానం మాత్రమే యిచ్చేవాడు. అంతకు మించి మాట్లాడ్డానికి వాడికీ నాకూ కూడా విషయాలేమీ లేకుండాపోయాయి. పదిహేను రోజులు యీ విధంగా గడిచాక ఒక రోజున బడికి వెళ్ళేముందు "ఏమిరా, మీ అన్నయ్యలు యిప్పుడు తిట్టడం లేదు గదా?" అన్నాను. "వాళ్లు నన్ను పలకరించడమే లేదండి. నాతో మాట్లాడ్డమే మానేశారండి." అన్నాడు. "ఏం?" అని ప్రశ్నించాను "మీరు చదువు మానెయ్యమన్న రోజున మా బాబుతోనూ అమ్మతోనూ వాళ్లు చేస్తున్నదంతా చెప్పానండి. మాస్టార్ని

అందరి దగ్గరా తిడుతున్నారు. అంచేత మాస్టారు చదువుకోడుకు రావద్దన్నారు, అని యేడుస్తూ చెప్పాడండి. వాళ్లు ఆవేళ రాత్రి మా అన్నయ్యల్ని గట్టిగా తిట్టారండి. ఒరేయ్ నువ్వు చదువుకోవాలంటే బళ్లోకి వెళ్లి చదువుకో. మాస్టారింటికి వెళ్లకు—" అన్నారండి.—మాస్టారేం చేశారు. ఆయనకు నేనంటే యెంతో ప్రేమ. ఆయన నాకు ఉచితంగా చదువు చెబుతున్నారు, అన్నానండి. ఆ యెదవ మెట్ట వేదాంతాలన్నీ వదిలేసి నేను చెప్పినట్టు చేస్తే చెయ్యి. లేకపోతే నువ్వు బడికి వెళ్లడం కూడా మానెయ్యి--అన్నాడండి మా బాబు." అని చెప్పాడు. "అయితే మీ బాబూ అమ్మా నేను నీ చేత రూపాయలు తెప్పించానని అనుకొంటున్నారా?" అన్నాను.

"లేదండి. నేను స్పష్టంగా చెప్పేశానుకదండీ మాస్టారు తెమ్మనలేదు, నేనే పట్టుకెళ్ళానని?" "అయితే నా దగ్గరకి ఎందుకు వెళ్ళొద్దన్నారు." "మీ మామయ్యగారూ మావాళ్ళూ చాలాసేపు దెబ్బలాడుకొన్నారండి. ఆవేళ మీ మామయ్యగారు మీ కుర్రాడు మావాళ్ళ గుమ్మంలోకి వెళ్లడానికివీల్లేదన్నారండి. ఆయన పంపమని బతిమాల్నా పంపమయ్యోయ్ యేమనుకొన్నావో గాని అన్నాడండి మా బాబు. అంచేత మా బాబు అమ్మ మీ దగ్గరికి వెళ్లవద్దన్నారండి" అయితే ఆమర్నాడు ప్రొద్దుటే వచ్చావెందుకు నువ్వు?" "మా వాళ్లు చూడకుండా వచ్చేశానండి." అన్నాడు. వాళ్ల వాళ్లు వద్దన్నా వీడు నా వద్దకు రావడం మాన్లేదు. మా రాధ పొమ్మన్నా ఆ రోజున వీడు కదల్లేదు. అలాగే నిలబడ్డాడు. నువ్వు చదువు మానేస్తే నువ్వూ నేనూ సుఖపడతాం అని నేనంటే వాళ్లు చంపినా చదువు మాననన్నాడు. ఆ తరువాత, నువ్వు రోజూ మాయింటికి వస్తూండడం, చదువుతూండడం జరుగుతూంటే నా పరపతి పోయి చివరికి నా ఉద్యోగం కూడా పోతుంది అన్నాను. ఇంక వాడు మాట్లాడలేదు. తరువాత చదువుకొనేందుకు రాలేదు.

ఇక నేనేమీ ప్రశ్నించలేదు. బడికి బయలుదేరాను. నా వెనుక నే వాడూ వచ్చాడు.

* * *

ఆరు నెలలు గడిచాయి. ఈ ఆరు నెలల్లోనూ బడి ఉన్నా లేకపోయినా ప్రతిదినం సుబ్బారావు మా యింటికి వస్తూనే వున్నాడు. నన్ను వెంబడిస్తూనే వున్నాడు. అది పంతొమ్మిదివందల యాభైమూడో సంవత్సరం ఆగష్టు నెల. గోదావరి గట్లు తెంచుకొని గ్రామాలకీ, పొలాలకీ, కాలవలకీ, చెరువులకీ వుండే భేదాన్ని దూరం చేసింది. అంతా జలమయం. గొయ్యెక్కడో, నుయ్యెక్కడో, చెరువెక్కడో, చేలెక్కడో తెలియడం లేదు. పల్లపు ప్రదేశాలలో వుండే పల్లెలూ, గూడేలూ నీటిలో మునిగిపోయాయి. మా గ్రామం వీథులలో మోకాల్లోతునా తొడలోతునా నీరు ప్రవహిస్తోంది. జాతి, కుల, మత భేదాలు తొలగి పోయాయి. ఊళ్ళో గట్టిగావున్న యిళ్ళూ మెరక మీద వున్న యిళ్ళూ జనంతో కిటకిటలాడుతూన్నాయి. బద్ధ వైరాలున్నవాళ్లు, ఒకే పంచలో చేరుకొని కలిసి వండుకొని తింటున్నారు. ఒకే చదరపు గజంలో పడుకొంటున్నారు. ఈ వీధివార్త ఆ వీధికికూడా తెలియడం కష్టమౌతోంది. ఆ పల్లె కొట్టుకుపోయిందనీ, ఈ గ్రామంలో యిళ్లల్లోకి నీరు వచ్చేసిందనీ వదంతులు బయలుదేరాయి. మా యింటి గుమ్మంముందు మూడు మెట్లు మునిగిపోయాయి. ఇంకో అడుగు నీరువస్తే మాయిల్లు నీటితో నిండుతుంది. వీధి గడపమీద ఒక అడుగు యెత్తున మట్టితో గోడకట్టాను. ఇంటికి బయట వున్న ద్వారాలన్నీ బిగించి కాళీలన్నీ మట్టితో మర్దించాను. మా రెండు అరుగులమీదకూ రెండు మాల వాళ్ళ కుటుంబాలు చేరాయి. మా అత్తవారి ఊరి సంగతి తెలియలేదు. వాళ్ళేమైపోయారో అని మా రాధ దిక్కుమొహం పెట్టింది. వాళ్లయిల్లు గట్టిది, ఎత్తైనది, వాళ్ళకేమీ పరవాలేదని ధైర్యం చెబుతూ ఉన్నాను. ఇంతలో ఆ ఊరినుండి యిద్దరు వ్యవసాయదార్లు తడిసినబట్టలతో నీటిని తోసుకొంటూ వీధిలో వెడుతూ నన్ను పేరెట్టి పిలిచి "బాగున్నారా బాబూ? మీ మామయ్యగోరు తెల్సుకొని రమ్మన్నారు" అన్నారు. "ఆఁ, బాగానే ఉన్నాం. వారంతా ఎలా ఉన్నారు? మీ ఊళ్లో నీరు ఎంతవరకూ వచ్చింది?" అని అడిగాను. ఇలాగే మోకాల్లోతూ తొడలోతునా వీధుల్లో నీరు పారుతోందండి" "మరి రోడ్డెలాగుంది. మీ రెలా రాగలిగారు?" "రోడ్డుమీద మోకాల్లోతున నీరుందండి" రోడ్డుపక్కనుండే చెట్లూ తుప్పలూ ఆనవాలుగా చూసుకొంటూ వచ్చామండి" "మా మామగారింట్లో కులాసాగా ఉన్నారా?" "అయ్యా" అని చెప్పి వాళ్లు

వెళ్ళిపోయారు. చిన్నా, ఈవేళ సుబ్బారావు రాలేదు. మధ్యాహ్నం మూడు గంటలౌతుంది. నేను గుమ్మంలోపల నిలబడి ఎదుటికి చూస్తున్నాను. కాలవగట్టు నీటిమీద ఒక అడుగు యెత్తున కనుపిస్తోంది. మామిడిచెట్టుకు కట్టి ఉన్న బల్లకట్టు స్పష్టంగా కనుపిస్తోంది. ఆ గట్టుకీ మాయింటికీ ఒక ఫర్లాంగు లోపుగా దూరముంటుంది. అదంతా జలమయం. కాలవగట్టు కావల ఎక్కడా గడ్డియైనా మొలవకుండా ఉన్న పచ్చమట్టి నేలలా కనుపిస్తోంది బురద నీటితో నిండిన పంటప్రదేశం. అక్కడక్కడ చిన్న చిన్న తాడి, ఈత మొదలయిన చెట్ల తలలు కనిపిస్తున్నాయి. జలప్రళయమని పురాణాలలో వినడమేగాని చూచినవాడెవడూ లేడు. ఈ నీరు యిలాగే పెరిగిపోతే ప్రళయంగాక మరేమౌతుంది అని మనస్సులో అనుకొంటున్నాను. ఇంతలో ఎవడో కుర్రాడు కాలవకి అవతలిగట్టు యెక్కాడు. నేను పరకాయించి చూస్తున్నాను. వాడు కాలవలోని బల్లకట్టు యెక్కాడు. తాడు లాగుతున్నాడు కాబోలు బల్లకట్టు మెల్లగా కదులుతోంది. కొంతసేపటికి వాడు యివతలిగట్టుకి వచ్చాడు. కాలవగట్టునుండి మా ఇంటికి వచ్చే బాట వుండేచోట నీటిలోకి దిగుతున్నాడు. నా నరనరమూ గజగజ వణకిపోయింది. ఏవో వెర్రికేకలు వేసుకొంటూ ఒక్క గంతులో మా వీధిగుమ్మంలోంచి నీటిలోకి ఉరికాను. వాడు దిగేచోట పల్లం, వాడికందని లోతుంటుందక్కడ, మునిగిపోతాడు అని నా హృదయం హాహాకారం చేస్తోంది. మోకాళ్ళ మునిగే నీటిలో గెంతుకుంటూ పరుగెత్తుతున్నాను. అరవబోతున్నాను. మాట రావడంలేదు. కాళ్ళు తడబడి పడి లేస్తున్నాను. నా వెనుక దగ్గరలోనే ఎవరో కేకలు వేస్తున్నారు. ప్రపంచమంతా హాహాకార ధ్వనితో మారుమ్రోగుతూన్నట్లుంది నా చెవులికి. ఇంతసేపూ కనుపించిన ఆ కుర్రాడు కనుపించడంలేదు. ఇంక కాలువగట్టు నలభైగజాల దూరముంటుంది. నేను మొలలోతు నీటిలో నిలబడి యేవో వెర్రి కేకలేస్తున్నాను. చుట్టూ చూస్తున్నాను. వాడు కనుపించడంలేదు. మా అరుగుమీద మకాం చేసిన మాలవాళ్ళిద్దరూ మునిగిపోయాడు, కొట్టుకుపోయాడు అంటూ నా ప్రక్కనే కేకలు వేస్తున్నారు. ఇంకా యెదుటికి వెళ్లాం. పీకలోతు నీరుంది. కాలవగట్టు ఎక్కడానికి యీదడం మొదలుపెట్టాం. బాటదాటి వందగజాలు ప్రవాహవేగానికి కొట్టుకొనిపోయి కాలువగట్టు యెక్కాం. ఒక ఫర్లాంగు, రెండు ఫర్లాంగులు, మూడు ఫర్లాంగులు పరుగెత్తాం. వాడు కనుపించలేదు. మా కంగారూ గోలా యెక్కువైపోయింది. పిచ్చెక్కినవానిలా వెనక్కీ ముందుకీ పరుగెత్తుతున్నాను. నేను యింకా ముందుకి పరుగెత్తాను. నా కూడా ఒకడు పరుగెత్తుకొని వస్తున్నాడు. ఒకడు మళ్లీ వెనక్కి వెళ్ళాడు. ఇంకో అరమైలు పరుగెత్తాం. ఇంక వెళ్లడానికి వీల్లేదు. కాలువగట్టు తెగి నీరు ఉరకలేస్తూ ప్రవహిస్తోంది "రండి బాబయ్యా, వెనక్కి వెళదాం. ఇక్కడిదాకా రాడు. కాలవలో నీరు బయటికి పోతూంది" అంటూ మాలాడు వెనక్కి పరుగెత్తాడు. వాని వెనుకనే, నేనూ పరుగెత్తాను. కొంతసేపటికి యథాస్థానానికి చేరాం. రెండో మాలాడు చేలల్లో గుండెలోతు నీటిలో కుర్రాణ్ణి భుజాలమీద యెక్కించుకొని బాటవైపుకి నడుస్తున్నాడు. కుర్రాడి తల, వాడితలమీద వ్రేలబడి ఉంది. మే మిద్దరం నీటిలో కురికి వాడివైపుకి యీదాం. వాణ్ని సమీపిస్తున్నకొద్దీ నా అనుమానం బలపడుతోంది. నా కాళ్లూ చేతులూ పట్టుతప్పుతున్నాయి. నా ప్రక్కను నడుస్తూన్న మాలవాడి భుజం పట్టుకొన్నాను. నా స్థితి చూచి "అదేం బాబయ్యా?" అంటూ నన్ను పట్టుకొని లాక్కెళ్లాడు. కుర్రాడి ముఖం స్పష్టంగా కనుపించింది. మా సుబ్బారావే, వాడు. 'సుబ్బారావూ' అంటూ యేమేమో అరిచాను. అప్పటికప్పుడే పాతిక ముప్ఫైమంది జనం మోకాల్లోతు నీటిలో నిలబడి యేవో గోలచేస్తున్నారు. సుబ్బారావును తీసుకొచ్చి మాయింటి అరుగుమీద పడుకోబెట్టాం. ఊళ్ళోని డాక్టరుగారు వచ్చారు. నాడి అందడంలేదన్నారు. కడుపునొక్కి త్రాగిన నీరంతా కక్కించారు. ఏవో ఇంజెక్షన్లు చేశారు. కుంపటి పెట్టి వళ్ళంతా ఆరకాస్తున్నారు. "కొనవూపిరుంది. యేం జరుగుతుందో చెప్పలేం" అన్నారు డాక్టరుగారు. నేను స్తంభించిపోయి వాడిదగ్గర బండరాయిలా కూర్చున్నాను. సూర్యాస్తమయ సమయానికి కొంచెం కదిలాడు. చైతన్యంలేనివానిలా కూర్చున్న నాకు చైతన్యం కలిగింది. మరికొంతసేపటికి 'మాష్టారు' అని అస్పష్టంగా అన్నాడు. వాడి ముఖందగ్గర ముఖం పెట్టాను. మళ్ళీ అయిదు నిమిషాలకి కళ్లు కొంచెం తెరచి 'మాష్టారూ' అని నూతిలోంచి పిలచినట్లు అన్నాడు. "ఏం నాయనా? సుబ్బారావూ?" అన్నాను. మళ్ళీ వెంటనే వాని కన్నులు మూతపడిపోయాయి. నా కళ్లు నీళ్ళతో నిండిపోయాయి. వాడి ముఖం చూడ్డానికి వెంటనే తుడుచుకొన్నాను. రెండు మూడు ఎక్కిళ్లు వచ్చాయి వాడికి. అంతే, ఇక వాడు శాశ్వతంగా కన్నుమూశాడు. లోకమంతా అంధకారబంధురమైంది.